

జెండా ఊపి 5కె వాక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

సమష్టి కృషితో

క్రీడా హబ్‌గా జిల్లా

కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాను క్రీడా హబ్‌గా తయారు చేయడానికి సమష్టి కృషి, సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కలెక్టరేట్ వద్ద 10కె రన్, 5కె వాక్‌ను ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విశాలాఫెర్రర్, అల్ట్రా మారథాన్ రన్నర్ జువాన్ మాన్యుయేల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మూడో 10కె రన్, 5కె వాక్ నిర్వహించడం శుభపరిణామమన్నారు. ముస్సోరిలో ఐఏఎస్ శిక్షణ పొందుతున్న సమయంలో నిర్వహించిన రన్‌లో తాను 11వ స్థానంలో వచ్చానని ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. మాంచో ఫెర్రర్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా క్రీడలు, క్రీడాకారులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, భవిష్యత్తులో మరింత మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దుతామని తెలిపారు. అనంతరం రన్, వాక్ అనంత క్రీడాగ్రామం వరకు సాగింది. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి, విదేశీ రన్నర్స్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు నోటీసు

- 'నోటి దురుసు' టీచర్‌కు షోకాజ్
- గత డిసెంబరు 7న పీటీఎంపై విమర్శలు
- తాటిచెర్ల స్కూల్ ఘటనపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు

అనంతపురం విద్య, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్‌రెడ్డికి జిల్లా విద్యాశాఖాధికారులు శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం గత ఏడాది స్కూళ్లలో ప్రతిష్ఠాత్మకంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్(పీటీఎం) నిర్వహించింది. డిసెంబరు 7న అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల స్కూల్‌లో నిర్వహించిన వేడుకలో గొడవ జరిగింది. ఆ స్కూల్‌లో పనిచేసే అశోక్ కుమార్‌రెడ్డి గత ప్రభుత్వంలో స్కూల్‌కు సక్రమంగా రాకపోవడంపై కొందరు విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశ్నించారు. అది కాస్తా గొడవకు దారి తీసింది. ఈ క్రమంలో పిల్లలు, తల్లిదండ్రులు మెగా పీటీఎంలో భోజనాలు ఎలా అంటూ అడగ్గా అశోక్‌కుమార్‌రెడ్డి రెచ్చిపోయారు. ప్రభుత్వ కార్యక్రమంపై ఎడాపెడా విమర్శలు చేశారు. చికెన్, పొట్టేళ్లు కోసి పెట్టాలా అంటూ దురుసుగా ప్రవర్తించాడు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో చికెన్ పొట్టేళ్లు కోసి పెట్టాలా..? మీనం... మేషం, నోటి దురుసుపై అదే ప్రేమ శీర్షికలతో వరుస కథనాలు వచ్చాయి. తాటిచెర్ల స్కూల్ ఘటనపై విద్యాశాఖాధికారులు డీవైఈఓను శ్రీనివాస్‌ను విచారణాధికారిగా నియమించగా ఆయన జాప్యం చేస్తూ వచ్చారు. చివరికి ఇటీవల ఆయన డీఈఓకు రిపోర్ట్ ఇచ్చారు. ఆయనపై చర్యలు తీసుకోవడానికి మాత్రం అధికారులకు చేతులు రావడం లేదు. అయితే ఇటీవల కలెక్టర్ సైతం రిపోర్ట్ కోరారు. అయినా పెద్దగా స్పందన కనిపించలేదు. ఈనెల 24న జిల్లాకు విద్యాశాఖ కమిషనర్ వస్తుండటంతో.. చర్యల్లో ఎట్టకేలకు కొంతవేగం పెంచారు. డిప్యూటీ డీఈఓ నివేదిక ఆధారంగా అశోక్ కుమార్ రెడ్డికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.



పాఠశాలలో గొడవ జరుగుతున్న దృశ్యం(ఫైల్)

దేవుడి భూమికి

దిక్కెవరు..?

ఆక్రమణలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ మాన్యం

- వెబ్‌ల్యాండ్‌లోకి దేవుడి భూమి పదెకరాలు
- మాజీమంత్రి ఉషశ్రీచరణ్ అండతోనే దురాగతం
- కొత్తూరు గ్రామస్థుల విన్నపాన్ని పట్టించుకోని అధికారులు





లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

కళ్యాణదుర్గం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): దేవుడి భూములకే దిక్కులేకుండా పోయింది. కొందరికి దేవుడంటే భక్తి, భయము రెండూ లేకుండా పోయాయి. అందుకే దేవుడి భూమిని సైతం దర్జాగా ఆక్రమించుకున్నారు. కంబదూరు మండలం కొత్తూరులో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ మాన్యం భూమి పదెకరాలను గ్రామానికి చెందిన ముగ్గురు వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారు. అందులో దర్జాగా పంటలు పండించుకుంటూ ఆదాయం గడిస్తున్నారు. ఆలయ భూమిని కాపాడాలని కొందరు గ్రామస్థులు అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.

ఐదేళ్ల నుంచి గ్రామస్థుల పోరాటం

కొత్తూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయ మాన్యం భూములను ఆక్రమణల నుంచి కాపాడాలని గత ఐదేళ్ల నుంచి గ్రామస్థులు పోరాటం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారు దృష్టికి గ్రామస్థులందరూ వెళ్లి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో కూడా గత ఏడాది జనవరి 29న గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. అంతకు ముందు రోజు ఇదే విషయంగా కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. పలు సందర్భాల్లో కంబదూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట బైఠాయించి, ఆందోళన చేపట్టారు. ఎన్నిసార్లు, ఎన్ని ఆందోళనలు చేసినా అధికారుల్లో చలనం లేకుండా పోయిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనలు, అర్జీలు ఇచ్చినప్పుడు మాత్రమే అధికారులు హడావుడి చేస్తారు కాని ఆ తర్వాత పట్టించుకోరని వాపోతున్నారు.

రీసర్వేతో బట్టబయలు

వైసీపీ పాలనలో కొత్తూరు గ్రామంలో ముగ్గురు వైసీపీ నాయకులు తమ పొలాలకు ఆనుకుని ఉన్న దేవుడి మాన్యం భూములను ఆక్రమించుకున్నారు. ఈ విషయం 2023 సెప్టెంబరులో చేపట్టిన భూ రీ సర్వేతో బహిర్గతమైంది. దీంతో గ్రామంలో రీ సర్వే చేయకుండా గ్రామస్థులందరూ అడ్డుకున్నారు. దేవుడి భూమిని కాపాడాలంటూ రీ సర్వేకు వచ్చిన అధికారులతో వాగ్వాదానికి దిగారు. రీ సర్వే చేసినప్పుడే దేవుడి మాన్యాన్ని వెబ్‌ల్యాండ్‌లోకి ఎక్కించుకున్నారన్న విషయం విషయాలు బయటపడింది.

అప్పటి మంత్రి అండతో ఆక్రమణ

మాజీ మంత్రి ఉష శ్రీచరణ్ అండతోనే ఈఆక్రమణ జరిగినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అప్పట్లో పోలీసులతో బెదిరించి, గ్రామమంతా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయించి, రీ సర్వే కార్యక్రమాన్ని ముగించారు. ఆలయ భూమిని కాపాడాలని కోరిన కొందరిని పోలీసులు తీవ్రంగా హెచ్చరించారు. లేనిపోని నోటీసులు అందించి పోలీసులు గ్రామంలో భయాందోళనలు సృష్టించారు. మాజీ మంత్రి ఉష శ్రీచరణ్ అండ చూసుకుని అప్పట్లో అధికారులు కూడా ఏ ఒక్కరు ఆలయ మాన్యం భూమిపై మాట్లాడలేదు. దీంతో ఆ ముగ్గురు పదెకరాల దేవుడి భూమిని దర్జాగా వెబ్‌ల్యాండ్‌లోకి ఎక్కించుకున్నారు. ఈ భూమి విలువ సుమారు రూ. 40 లక్షల దాకా ఉంటుందని గ్రామస్థులు పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వంలో న్యాయం కోసం ఎదురుచూపు

వైసీపీ పాలనలో యథేచ్ఛగా సాగిన అక్రమాలు, దౌర్జన్యాలకు కూటమి పార్టీల పాలనలో అడ్డుకట్ట పడుతుందని గ్రామస్థులు భావిస్తున్నారు. ఈక్రమంలోనే దేవుడికి న్యాయం జరుగుతుందని ఎదురుచూస్తున్నారు. గ్రామంలో భూ రీ సర్వే ప్రక్రియ ప్రారంభంకావడంతో ఇప్పుడైనా మాన్యం భూమినా కాపాడాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం కూడా కంబదూరు తహసీల్దారుకు గ్రామస్థులు ఆలయ భూమిని కాపాడాలని వినతిపత్రాన్ని అందించారు.

పూర్తిస్థాయిలో విచారిస్తాం



శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ మాన్యం భూములను కొందరు ఆక్రమించుకున్నారని ఈనెల 18న కొత్తూరు గ్రామస్థులు వినతిపత్రం అందించారు. ఇదే విషయంగా గ్రామంలోకి వెళ్లి పూర్తి స్థాయిలో విచారిస్తాం. ఇప్పటికే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను గ్రామంలోకి వెళ్లి విచారణ చేపట్టాలని ఆదేశాలు ఇచ్చాం. పూర్తి స్థాయిలో విచారించి ఉన్నతాధికారులకు నివేదికలు అందచేసి, తదుపరి చర్యలు తీసుకుంటాం.

-బాలకిషన్, తహసీల్దార్, కంబదూరు

వెబ్‌ల్యాండ్‌లోకి ఎక్కించారు



మా గ్రామ ఆలయ మాన్యం భూమిని దర్జాగా వెబ్‌ల్యాండ్‌లోకి ఎక్కించారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారుకు అన్ని ఆధారాలు ఇచ్చి సమస్యను చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదు. ఐదేళ్ల నుంచి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసి విసిగిపోయాం. కూటమి ప్రభుత్వంలోనైనా ఆలయ భూమికి రక్షణ కల్పించాలని కోరుతున్నాం.

-నారాయణప్ప, కొత్తూరు

ప్రయోజనం లేదు



శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ మాన్యం భూమిని ఆక్రమించుకున్నట్లు అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. మా గ్రామ ఆలయ భూములను కాపాడాలన్నదే మా ధ్యేయం. గతంలో మూడు సార్లు అధికారులకు అర్జీలు ఇచ్చినా ఫలితం శూన్యం. కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని కోరుతున్నాం.

-మదన్‌మోహన్, కొత్తూరు

ఎన్నో పోరాటాలు



ఆలయ మాన్యం భూములను కాపాడాలంటూ ఐదేళ్ల నుంచి ఎన్నో పోరాటం చేస్తున్నాం. సర్వే నెంబర్ 304-4 లో ఉన్న ఆలయ మాన్యం భూమిని కాపాడాలంటూ అధికారులను కోరుతున్నాం. గతంలో మాజీ మంత్రి ఉష శ్రీచరణ్ అండతోనే నన్ను పోలీసులతో బెదిరించారు. మరోసారి మా గ్రామంలో రీ సర్వే చేసేందుకు అధికారులు వస్తుండటంతో ఇప్పుడైనా ఆలయ భూమిని కాపాడాలని కోరుకుంటున్నాం.

-దొణతిమ్మప్ప, ఆలయ కమిటీ చైర్మన్, కొత్తూరు

నేటి నుంచి మళ్లీ బడి

- ముగిసిన సంక్రాంతి సెలవులు

అనంతపురం విద్య, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవుల తర్వాత సోమవారం నుంచి స్కూళ్లు పునః ప్రారంభంకానున్నాయి. జిల్లాలోని అన్ని స్కూళ్లకు విద్యాశాఖ ఈ నెల 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ సంక్రాంతి పండుగ సెలవులు ఇచ్చింది. ఆదివారంతో సెలవులు ముగిశాయి. దీంతో ప్రభుత్వ వసతిగృహాల్లో ఉంటూ చదువుకునే విద్యార్థులు, ప్రైవేట్ హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు స్కూళ్లకు వెళ్లేందుకు బయల్దేరారు. అనంతపురం నగరంలోని పలు సంక్షేమ హాస్టళ్లకు విద్యార్థులు ఆదివారం సాయంత్రమే చేరుకున్నారు. విద్యాలయాలు పునఃప్రారంభం కానుండటంతో పిల్లలు, తల్లిదండ్రుల్లో హడావుడి మొదలైంది.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

అనంతపురం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలు పరిష్కరించడం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను ఈ సోమవారం రద్దు చేసినట్లు కలెక్టరు వినోద్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఎస్సీ ఉప వర్గీకరణ కమిషన్ జిల్లాకు రావడం, కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఎస్సీ ఉపకులాల నుంచి అభిప్రా యాలు, వినతులు తీసుకుంటున్న నేపథ్యంలో గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్లు వెల్లడించారు. డివిజన్, మండల స్థాయిలో యథాతథంగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సమస్యలు ఉన్నవారు తమ అర్జీలను అక్కడ ఇచ్చుకోవాలని సూచించారు.

నేటి నుంచి పశు వైద్య శిబిరాలు

మండలానికి రెండు వైద్యబృందాల ఏర్పాటు

అనంతపురం అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పశు వైద్య శిబిరాలు సోమవారం నుంచి నిర్వహించనున్నారు. నెలాఖరు దాకా శిబిరాలు కొనసాగనున్నాయి. మండలానికి రెండు బృందాల చెప్పున జిల్లాలోని 31 మండలాలకు 62 ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో వెటర్నరీ డాక్టర్, సిబ్బంది ఉంటారు. పశుసంపద ఆధారంగా గ్రామాల్లో శిబిరాలు నిర్వహించాల్సిన షెడ్యూల్‌ను ఖరారు చేశారు. దీని ఆధారంగా ఆయా బృందాలు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం దాకా పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తాయి. ప్రత్యేకాధికారిగా అడిషనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రజనీ కుమారిని ప్రభుత్వం నియమించింది. జిల్లాలో నిర్వహించే కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షిస్తారు. పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించి, ఉత్పాదకత పెంచడం, వ్యాధులను నియంత్రించడమే పశు వైద్య శిబిరాల ప్రధాన ఉద్దేశమని పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి తెలిపారు.

పత్రానికో లెక్క..!

- దుడ్లిస్తేనే బర్త్ సర్టిఫికెట్లు
- మునిసిపాలిటీ, ఆసుపత్రి, రెవెన్యూ సిబ్బంది చేతివాటం
- డబ్బులిస్తే గుంతకల్లులో పుట్టకున్నా ధ్రువీకరణ పత్రం
- అపార్ నమోదు కోసం తల్లిదండ్రుల అవస్థలు



జనన, మరణ విభాగంలో సర్టిఫికెట్ల కోసం గుమిగూడిన దరఖాస్తుదారులు

గుంతకల్లు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): జనన ధ్రువీకరణ పత్రాల జారీ, అందులో ఏవైనా తప్పులుంటే సరిదిద్దడానికి కొందరు ఉద్యోగులు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కాలంలో పాఠశాలలో అపార్ నమోదుకు తప్పులు లేని బర్త్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరడం అక్రమార్కులకు వరంగా మారింది. ఇదే అవకాశంగా బర్త్ సర్టిఫికెట్లు, సవరణల కోసం వచ్చే వారి నుంచి అందినకాడికి దోచేస్తున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ. 300 నుంచి రూ. 1000ల వరకూ వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. బర్త్ సర్టిఫికెట్ ఎంట్రీ లేకుంటే రూ. రెండు వేల నుంచి రూ. ఐదు వేల దాకా వసూలు చేస్తున్నారు. అసలు పట్టణంలో పుట్టకపోయినా డబ్బిస్తే చాలు బర్త్ సర్టిఫికెట్లు గుంతకల్లులో పొందవచ్చన్న చందంగా పరిస్థితి మారింది. ఇప్పటిదాకా దాదాపు 10 వేల సర్టిఫికెట్ల ఎంట్రీలు, సర్టిఫికెట్లలో పేర్ల నమోదు, పేర్ల సవరణ కారణాలతో రూ. అరకోటికి పైనే ప్రజల నుంచి దండుకు న్నారు.

సమస్యలుంటే కాసుల పంట పండినట్లే..!

అపార్ నమోదుకు విద్యార్థులకు శాశ్వత గుర్తింపు ఐడీని జారీ చేయడానికి, ఆన్‌లైన్‌లో విద్యార్థుల అకడమిక్ హిస్టరీని పొందుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం రెండు నెలల కిందట అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీంతో తప్పులు లేని బర్త్ సర్టిఫికెట్లను పాఠశాలలకు సమర్పించాల్సి ఉంటుంది. బర్త్ సర్టిఫికెట్ సక్రమంగా ఉంటే సమస్యలేదు. కానీ బర్త్, ఆధార్ సర్టిఫికెట్‌లో విద్యార్థి పేరు/తండ్రి/తల్లి పేర్లకు సంబంధించి అక్షర దోషాలు ఉంటే వాటిని సవరించి పాఠశాలల్లో ఇవ్వాలి. ఈ కారణంగా రెండు నెలల నుంచి మీసేవ, గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలు, గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రి, రెవెన్యూ, పురపాలక సంఘ కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి. పట్టణవాసులే కాదు, గుంతకల్లు ఆసుపత్రుల్లో పుట్టిన వారు సైతం గుంతకల్లులోనే బర్త్ సర్టిఫికెట్లకు, సర్టిఫికెట్లలో విద్యార్థి, తల్లి, తండ్రి పేర్ల సవరణ, విద్యార్థి పేరు చేరిక తదితర అంశాలపై దరఖాస్తు చేసుకుంటున్నారు. వార్డు సచివాలయాలు, మీసేవ కేంద్రాలలో దరఖాస్తులు చేసిన తర్వాత, సర్టిఫికెట్ల కోసం పురపాలక సంఘ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. సర్టిఫికెట్ల జారీలో ఏవైనా సమస్యలుంటే బర్త్ అండ్ డెత్ డిపార్టుమెంటు సిబ్బంది పంట పండినట్టే. సర్టిఫికెట్ త్వరగా కావాలన్నా ఓ రేటు ఫిక్స్‌చేసి వసూలు చేస్తున్నారు. గడచిన నెల రోజుల నుంచీ ఈ వసూళ్ల కార్యక్రమం జోరుగా సాగుతోంది.

ఎక్కడ పుడితే ఏమి.. డబ్బిస్తే చాలు..!


గుంతకల్లులోని ప్రభుత్వ కార్యాలయాలలో డబ్బిస్తే పని జరిగిపోతుందన్న సమాచారం పాకిపోవడంతో గుంతకల్లు పట్టణం, మండలంతోపాటు కర్నూలు జిల్లాలోని చిప్పగిరి, పత్తికొండ, మద్దికెర, ఆలూరు, జిల్లాలోని ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, కర్ణాటకలోని బళ్లారి నుంచి సైతం ఇక్కడకు వచ్చి బర్త్ ఇన్‌ఫర్మేషన్ నాన్ ఎంట్రీ కింద దరఖాస్తు చేసి ఎంక్వయిరీ సిబ్బందిని మేనేజ్ చేసి సర్టిఫికెట్లు పొందుతున్నారు. ఈ సర్టిఫికెట్ల వ్యవహారంగా మధ్యవర్తులు పుట్టుకువచ్చి జేబులు నింపుకుంటున్నారు. పురపాలక సంఘ కార్యాలయంలో బర్త్ సర్టిఫికెట్లకు డబ్బు గుంజుతున్న విషయం గురించి కమిషనర్ నయ్యాం అహ్మద్‌ను వివరణ కోరగా, గతంలోనూ ఈ విషయంగా తనకు ఫిర్యాదులు వచ్చాయని, సిబ్బందిని హెచ్చరించానని తెలిపారు. బాధితులు వచ్చి నేరుగా ఫిర్యాదుచేస్తే తప్పక చర్యలు తీసుకుంటానని తెలియజేశారు.

గడువు మార్చి దాకా ఉండటంతో బర్త్ సర్టిఫికెట్ల కోసం వచ్చే జనంతో గుంతకల్లులోని పురపాలక సంఘం, ప్రభుత్వ ఆసుపత్రి, తహసీల్దారు కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి.

కాంట్రాక్టు ఉద్యోగులదే హవా

బర్త్ సర్టిఫికెట్ల జారీ విషయంలో గుంతకల్లు మునిసిపాలిటీ, ప్రభుత్వ ఆసుపత్రి, రెవెన్యూ కార్యాలయాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు దందా నడుపుతున్నారు. పురపాలక సంఘ కార్యాలయంలోని బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల విభాగంలో కాంట్రాక్టు ఉద్యోగులు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. రికార్డుల్లో విద్యార్థి పేరు నమోదు కాకున్నా, అప్లికేషన్‌లో ఏ లోసుగు ఉన్నా ఆ దరఖాస్తును పక్కనపెట్టి దందా నడుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కొక్కరితో రూ.300ల నుంచి రూ. 1,000ల వరకూ వసూలు చేస్తూ పంపకాలు చేసుకుంటున్నారు. గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలోనూ బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీకి చేతులు తడపందే పని జరగడంలేదు. సర్టిఫికెట్ అవసరమైన వారికి విసుగొచ్చే వరకూ తిప్పుతూ డబ్బు ఇచ్చిన తర్వాతే సర్టిఫికెట్ జారీ చేస్తున్నారు. కొందరిని మూడు నెలలపాటు తిప్పి, డబ్బు తీసుకుని గంటలోనే సర్టిఫికెట్ ఇచ్చి పంపిన సందర్భాలున్నాయి. ఈ డబ్బు వసూళ్లలో ఆసుపత్రి అధికారులకు సైతం వాటా వెళ్తున్నట్టు సమాచారం. సర్టిఫికెట్‌ను ఇవ్వడానికి రూ. 300ల నుంచి రూ. 1500ల దాకా వసులు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కాగా కొందరు నోటరీలు ఇస్తున్న స్పెషల్ నాన్ అడిసివ్ స్టాంప్ పేపర్‌లో ఇచ్చే అఫిడవిట్లను ఆసుపత్రి బర్త్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగి తిరస్కరిస్తున్నట్లు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. తప్పనిసరిగా నాన్‌జ్యుడీషియల్ స్టాంపు పేపర్‌పైనే అఫిడవిట్ ఉండాలంటూ తిప్పుతున్నాడని, ఇక తిరిగే ఓపికలేకతే అడిగినంత డబ్బిచ్చి నువ్వే చేయించుకురమ్మని అప్పగించేస్తున్నారు. అతడికి అనుకూలంగా ఉన్న నోటరీ చేత పనిచేయించుకుని దరఖాస్తుదారులచేత డబ్బు దంటుకుంటున్నాడని ఆరోపిస్తు న్నారు. అలాగే సర్టిఫికెట్ త్వరగా కావాలని వచ్చే వారి నుంచి పురపాలక సంఘం, ఆసుపత్రి, రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు ఇష్టానుసారంగా డబ్బులు గుంజుతున్నారు. ఈ డబ్బులో పై అధికారులకు ఇతోధికంగా ముట్టజెబుతున్నట్టు సమాచారం.

అశ్రునీరాజనం



కీ॥శే॥ పోట్ల రామప్ప గారు, M.A., B.Ed.,

జననం 01-07-1938

మరణం 19-01-2025

కెంచానపల్లి గ్రామం, రాయదుర్గం మండలం,

7/163, పోట్ల రెసిడెన్సీ, ప్రకాష్ రోడ్డు, అనంతపురము.

క్రమశిక్షణ, సమయపాలన, కఠోర శ్రమలతో, ఆదర్శ అధ్యాపకునిగా నిలచి, ఎందరో విద్యార్థినీ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది, కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించి, మా భవిష్యత్తుకు బంగారు బాట వేసిన మీరు భౌతికముగా మా నుండి దూరమైననూ, మీ మధురస్మృతులు మా మదిలో మెదులుతూనే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.... శోకతప్త హృదయాలతో...

భార్య : కీ॥శే॥ పోట్ల పద్మావతమ్మ గారు

కుమారులు : పోట్ల వేణుగోపాల్, పోట్ల రవికుమార్, పోట్ల చంద్రకాంత్ నాయుడు

కోడళ్లు : భువనేశ్వరి, రాధిక, భారతి

మరియు పోట్ల బ్రదర్స్, కుటుంబ సభ్యులు

మనవళ్లు - మనవరాళ్లు : పి. వేదవ్యాస్, M.S. (ఆస్ట్రేలియా), పి. సిరి సంహిత, B.E. W/o. డి. ప్రశాంత్, M.S. (USA), పి. సంధ్యామయూక, M.Sc.(Micro), పి. రామ్‌హృదయ్, B.E., పి. ధనుష్ శ్రీరామ్, B.E., పి. ధన్యశ్రీ, (B.E.)

అంత్యక్రియలు : 20-01-2025 సోమవారం ఉ॥ 9-00 గం॥లకు అనంతపురము, ప్రకాష్ రోడ్డు, పోట్ల రెసిడెన్సీ మా స్వగృహం నుండి బయలుదేరి గుత్తి రోడ్డులోని హరిశ్చంద్ర ఘాట్ నందు నిర్వహించబడును.

సెల్ : 9440566658, 9440515789, 8099683999


నెలరోజులైనా యాడికి వద్ద కాలువలో కనిపించని నీళ్లు

నీరు పారదా..?

యాడికి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): యాడికి కాలువకు నీళ్లు వదిలి నెలరోజులు అవుతున్నా ముందుకు సాగకపోవడంపై రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యాడికి కాలువ చివరిదాకా నీళ్లు పారితే భూగర్భ జలాల పెరుగుదలకు ఎంతో ఉపయోగం ఉంటుందని భావించారు. ఆ దిశగా ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి చొరవతో పెద్దవడుగూరు మండలం కదరగుట్టపల్లి వద్ద కాలువ రెగ్యులేటర్ గేట్లు ఎత్తి యాడికి కాలువకు నీళ్లు విడుదల చేశారు.



వారంరోజులు కాలువలో నీళ్లు బాగానే ముందుకు కదిలాయి. పచ్చారుమేకలపల్లి గ్రామం వరకు వచ్చిన నీళ్లు ఇక ముందుకు కదలలేదు. ఆయా గ్రామస్థులు తమ సమీపంలోని చెక్‌డ్యాంలకు నీళ్లు మళ్లించడంతో యాడికి కాలువలో నీళ్లు ముందుకు సాగడం లేదని మిగిలిన గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. కాలువలో నీటిపారకం చూడడానికి వచ్చిన అధికారులు సైతం నీళ్లు ముందుకు సాగకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. తర్వాత కొద్దిరోజులు కాలువలో నీళ్లు కొద్దిమేర ముందుకు సాగాయి. మళ్లీ షరామామూలే అన్నట్లు కాలువలో నీటి పారకం ముందుకు కదలడం లేదు. కాలువకు నీటిని వదిలి నెలరోజులకు పైగా అవుతున్నా ఇంతవరకు యాడికి వరకు రాలేదు. యాడికి నుంచి ఇంకా సగంపైగా యాడికి కాలువ ఉంది. చివరి వరకు నీళ్లు ఇంకెప్పుడు పారుతాయి అంటూ ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ చివరి వరకు నీళ్లు పారితే భూగర్భజలాలు పెంపొందుతాయని రైతులు ఆశలు పెట్టుకున్నారు. కాలువలో నీటి ఫ్లో కొద్దిగా పెరిగేటట్లు రెగ్యులేటరీ వద్ద గేట్లు పైకి ఎత్తాలని మండల రైతులు కోరుతున్నారు.

టమోటా కిలో రూ.10



అనంతపురం రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.8, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు ఆయన తెలిపారు.

మండ్లిపల్లిలో భారీ చోరీ

25 తులాల బంగారం.. రూ.3 లక్షల నగదు అపహరణ

తనకల్లు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మండ్లిపల్లిలో భారీ చోరీ జరిగింది. ఇందుకు సంబంధించిన ఎస్‌ఐ గోపి ఆదివారం తెలిపిన మేరకు.. మండ్లిపల్లికి చెందిన మల్లికార్జునరెడ్డి ఈనెల 16న రాత్రి కుటుంబ సభ్యులతో శ్రీశైలం దైవదర్శనానికి వెళ్లారు. 18వతేదీ రాత్రి పొద్దుపోయిన తరువాత ఇంటికి చేరుకున్నారు. ఇంటి తాళాలు పగలకొట్టిఉండడంతో లోపలికెళ్లి పరిశీలించారు. ఇంటిలో ఉన్న బీరువాలను పగులకొట్టి దొంగలు తమ కుమారులు, కోడళ్లు బీరువాల్లో దాచుకున్న 25 తులాల బంగా రం, 26 తులాల వెండి, రూ. 3 లక్షల నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం ఉదయమే అనంతపురం నుంచి పోలీసు జాగిలాలను రప్పించి పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్ కూడా వచ్చి చోరీ జరిగిన ఇంటిలోని వస్తువులు, బీరువాలు, మంచాలను, క్షుణంగా పరిశీలించింది. కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి, రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్‌ఐ గోపి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మల్లికార్జునరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇళ్లకు తాళాలు వేస్తే.. సమాచారం ఇవ్వండి: సీఐ

ఎవరైనా ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్తున్నప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కదిరి రూరల్ సీఐ నాగేంద్ర తెలిపారు. విలువైన బంగారం, వెండి, నగదు ఇళ్లలో ఉంచుకోకూడదని, బ్యాంక్‌లాకర్లలో దాచుకోవాలని సూచించారు. ఇళ్లవద్ద అవసరమైతే సీసీ కేమెరాలను కూడా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు బంధువులు, స్నేహితులు, చుట్టుపక్కల ఇళ్లవారిని అప్రమత్తం చేయాలన్నారు.

మర్తాడులో...

గార్లదిన్నె, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మర్తాడు గ్రామంలోని ఓ ఇంట్లో దొంగలు చొరబడి తులం బంగారం, 11 తులాలు వెండి అభరణాలు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. మర్తాడులో హాజిబాషా, షకీలా దంపతులు గ్రామంలో కూలీ పనులతో జీవనం సాగించేవారు. అనంతపురంలో షకీల తమ్ముడి నిశ్చితార్థం ఉండడంతో ఈనెల 11న వెళ్లారు. ఆదివారం తిరిగి మర్తాడుకు వచ్చారు. ఇంటి తాళం పగలకొట్టి బీరువాలోని 11 తులాల వెండి ఆభరణాలు, తులం బంగారు ఆభరణాలు, రూ.30వేల నగదును దుండగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మహమ్మద్‌గౌసబాషా, జమేదార్ గురుమూర్తి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తల్లిమడుగుల పెద్దమ్మ ఆలయంలో..

కనగానపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తల్లిమడుగుల గ్రామం పెద్దమ్మ ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆదివారం ఉదయం పెద్దమ్మ ఆలయానికి పూజ చేసేందుకు వెళ్లిన పూజారి అమ్మవారికి అలంకరించిన వెండి అభరణాలు లేకపోవడాన్ని గుర్తించారు. విషయాన్ని గ్రామస్థులకు తెలిపారు. ఈ మేరకు కనగానపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన అభరణాల విలువ దాదాపు రూ.2లక్షల వరకు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

ఏఆర్ ఎస్‌ఐపై చర్యలు తీసుకోండి

కొడుకుపై దాడి చేశాడని మహిళ ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌లో బాధిత మహిళ, ఆమె కుమారుడు

అనంతపురం క్రైం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తనను రెండో పెళ్లి చేసుకున్న ఏఆర్ ఎస్‌ఐ చంద్రశేఖర్ తన కొడుకుపై చేయి చేసుకున్నాడని ఓ మహిళ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదివారం రాత్రి అంజలి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చింది. 14వ బెటాలియన్‌లో పనిచేస్తున్న ఏఆర్ ఎస్‌ఐ చంద్రశేఖర్ తనను రెండో పెళ్లి చేసుకున్నాడని, గత కొంతకాలంగా దూరం పెడుతున్నాడని తెలిపింది. విజయవాడలో చదువుతున్న కొడుకు స్కూల్ ఫీజు కడతానని చెప్పి సాయంత్రం ఇంటికి పిలిపించుకున్నాడని, అక్కడికి వెళితే మరో వ్యక్తితో కలిసి దాడి చేశారని ఆరోపించింది. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు సమాచారం. ఈ ఘటనపై త్రీటౌన్ సీఐ శాంతిలాల్‌ను వివరణ కోరగా...ఆమె ఏఆర్ ఎస్‌ఐ తన కొడుకుపై దాడి చేశారని చెప్పారని, కానీ ఫిర్యాదు ఇవ్వడం లేదన్నారు. శాశ్వత పరిష్కారం కావాలని కోరుతున్నారని వివరించారు.

స్ప్రేయర్ల కోసం ఎదురుచుస్తున్నాం



పంటలకు రసాయనిక మందు పిచికారి చేసేందుకు స్ప్రేయర్లు అద్దెకు తెచ్చుకుంటున్నాం. కూటమి ప్రభుత్వంలో రాయితీ కింద అందే వ్యవసాయ పరికరాల కోసం ఎదురుచుస్తున్నాం. ప్రభుత్వం ఈ ఏడాదైనా స్ప్రేయర్లు అందించి రైతులకు సహకరించాలి. రైతుల అవసరాల మేరకు యంత్రాలను పంపిణీ చేయాలి.

-ధనుంజయ, హరేసముద్రం

యంత్రాలు.. ఎప్పుడిస్తారో..?


ధాన్యం రాశులపై కప్పిన అద్దె పట్టలు

రాయితీ పరికరాలు, టార్పాలిన్ల కోసం నిరీక్షణ

కూటమి ప్రభుత్వంపై అన్నదాతల ఆశలు

వైసీపీ హయాంలో వీటికి మంగళం

బొమ్మనహాళ్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో యంత్రాలు, పరికరాలు, సూక్ష్మ పోషకాలు కీలకం. వీటిని గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రాయితీతో రైతులకు సరఫరా చేశారు. వైసీపీ అధికారంలో వచ్చాక ఈ రాయితీ పరికరాలన్నింటికి మంగళం పాడారు. ప్రధానంగా స్ప్రేయర్లు, కల్టివేటర్లు, ట్రాక్టర్లు సహాయకారిగా ఉంటాయి. పంటలకు నష్టం వాటిల్లకుండా మంచి దిగుబడులు వచ్చేందుకు సూక్ష్మపోషకాలు అవసరం. కల్లాల్లో పంట ఉత్పత్తుల రక్షణకు టార్పాలిన్ పట్టలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు దాటుతున్నా రాయితీ పరికరాలు, సూక్ష్మపోషకాలు, టార్పాలిన్ పట్టలు పంపిణీ ఊసే కనిపించలేదు. వీటి కోసం బొమ్మనహాళ్ మండలంలో రైతులు ఎదురు చూస్తున్నారు. వైసీపీ హయాంలో రైతులకు కనీసం టార్పాలిన్ పట్టలకు కూడా ఇవ్వలేదు. దీంతో వీటిని కొనుగోలు చేయడానికి రైతులకు భారమయ్యేది.

యంత్ర పరికరాలేవీ..?

పంట సాగుకు యంత్రపరికరాలు ఎంతో అవసరం. ఇవి లేనిదే వ్యవసాయ పనులు ముందుకు సాగే పరిస్థితి లేదు. గత ఐదేళ్లు రాయితీ యంత్రపరికరాలు పంపిణీ జరగలేదు. పంటలకు ఆశించే తెగుళ్ల నివారణకు మందు పిచికారి చేయాలంటే స్ప్రేయర్లు తప్పనిసరి. గ్రామాల్లో స్ప్రేయర్ల కొరతను రైతులు ఎదుర్కొంటున్నారు. అరకొర స్ప్రేయర్లతో మందులు పిచికారి చేస్తున్నారు. దీనివల్ల పిచికారిలో జాప్యం జరిగి పంటలు దెబ్బతింటున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. వాటిలో ఉన్న కొన్ని స్ప్రేయర్లతోనే రైతులు ఇప్పటికీ నెట్టుకువస్తున్నారు. రాయితీ స్ప్రేయర్ల కోసం వ్యవసాయ కార్యాలయాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. బ్యాటరీ స్ప్రేయర్లు, కల్టివేటర్లు, పవర్‌వీడర్, పవర్ స్ప్రేయర్లు ట్రాక్టర్లు ఇలా 19 రకాల యంత్రపరికరాలను రాయితీపై పంపిణీ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వం వాటి ఊసెత్తకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఖరీఫ్‌లో పంట చేతికి వచ్చిన సమయంలో అధిక వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం కుప్పలు తడవకుండా కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడ్డారు. టార్పాలిన్లు అద్దెకు తెచ్చుకుని పంటలను కాపాడుకున్నారు. కల్లాల్లో ఉన్న మిరప తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతుల వద్ద పట్టలు లేక అద్దెకు దొరక్క వరి ధాన్యం, మిరప, మొక్కజొన్న వంటి పంటలను కాపాడుకోలేక నష్టాలను చవిచూశారు.

సూక్ష్మ పోషకాల ఊసే లేదు

సూక్ష్మ పోషకాలలోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. జింక్, బోరాన్, మెగ్నీషియం, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు పంటలకు అవసరం. గతంలో టీడీపీ ప్రభుత్వం ఆయా సూక్ష్మ పోషకాలను రాయితీపై రైతులకు అందించింది. ఖరీఫ్ ముగిసి రబీ సీజన్ వచ్చినా నేటికీ వాటి ఊసేలేదు. సూక్ష్మపోషకాల వల్ల కలుగుతున్న పంటల నష్టాన్ని నివారించుకోవడానికి రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వీటి ధరలు మార్కెట్‌లో అధికంగా ఉండటంతో రైతులపై ఆర్థిక భారం పడుతోంది. పంటలకు తక్షణ అవసరంగా ఉన్న సూక్ష్మ పోషకాలను రాయితీపై అందించాలని రైతులు కోరుతున్నారు.

టార్పాలిన్లు పంపిణీ చేయాలి



వరి ధాన్యం ఆరబెట్టేందుకు నానా తంటాలు పడ్డాం. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు టార్పాలిన్ పట్టలు పంపిణీ చేయలేదు. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చింది. ఇప్పుడైనా రైతులకు పట్టలు పంపిణీ చేయాలి. ధాన్యం కప్పేందుకు టార్పాలిన్లను అద్దెకు తెచ్చుకున్నాం. అద్దె భారమయింది. రూ.2 వేల వరకు ఖర్చయింది. ఒక టార్పాలిన్‌కు రోజుకు రూ.20 నుంచి రూ.30 వరకు అద్దెలు వసూలు చేశారు.

-ఎర్రిస్వామి, శ్రీధరఘట్ట

వసూళ్ల డీసీటీఓ..!

వాహనదారులతో అక్రమ వసూళ్లు

సోషల్ మీడియాలో వీడియో హల్‌చల్


నల్లబండల వాహనదారులతో వాగ్వాదం చేస్తున్న డీసీటీఓ, ఆయన కుమారుడు

అనంతపురం క్రైం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వచ్చే జీతం చాలదనో లేక మరో రెండు నెలల్లో రిటైర్డ్ అవుతాననో వాణిజ్య పన్నుల శాఖలో ఓ డీసీటీఓ వసూళ్లకు తెగబడ్డాడు. ఇటీవల మద్యం మత్తులో ఆయన నల్లబండలు తరలిస్తున్న వాహనాలను ఆపి, డబ్బు డిమాండ్ చేయడం, వారు ప్రశ్నించడం మొత్తం వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. పై అధికారుల వద్ద అతివినయం నటిస్తూ, హైవేపై వసూళ్లకు తెగబడే డీసీటీఓ సుబ్బరాయుడి బాగోతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నిత్యం హైవేలలో తనిఖీల పేరుతో వాహనాలను ఆపి వసూలు చేస్తుంటారు. ఈ సారి ఏకంగా తన కుమారుడిని వెంట పెట్టుకుని వెళ్లి మరీ వసూలు చేశారు. తాత్కాలిక నెంబరుతో ఉన్న కొత్త కారులో ఈ వసూళ్ల వ్యాపారం పెట్టారు. మూడు రోజుల కిందట రాత్రి సమయంలో నల్లబండలు తరలిస్తున్న వాహనాలను అడ్డుకుని వసూళ్లకు తెరలేపారు. వారు తీసిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. సుబ్బరాయుడు ప్రస్తుతం అనంతపురం సర్కిల్-2లో డీసీటీఓగా పనిచేస్తున్నారు. ఈయన మీద అనేక ఆరోపణలున్నాయి. తరచూ ఇలా హైవేలలో వెళ్లి వాహనదారుల నుంచి తాను సేల్స్ టాక్స్ ఆఫీసర్‌నంటూ వసూలు చేస్తుంటారని సమాచారం. అది రాత్రా, పగలా అన్నది చూసుకోరట. వాస్తవానికి లారీ చెక్ పేరుతో కొన్ని సందర్భాల్లోనే ఉన్నతాధికారులు చర్యలకు ఆదేశిస్తుంటారు. అలాంటి సమయాల్లోనే వాహనాలను తనిఖీ చేయాలి. కానీ ఈయన తరచూ అదే వ్యవహారం చేస్తుంటారు. ఈయన ప్రస్తుతం కర్నూలులో ఉంటుండటంతో ప్రయాణ సమయాల్లో వచ్చేటప్పుడు, పోయేటప్పుడు వసూళ్ల దందాకు తెరలేపుతుంటారట. నల్లబండల తరలిస్తున్న వాహనదారులను ప్రశ్నించి డబ్బు డిమాండ్ చేయడంతో వారు మీరు ఎవరని..? ఫలానా శాఖలో ఏ కేడర్‌లో పనిచేస్తారని..? మీరు మద్యం తాగారని హిందీలో ప్రశ్నిస్తున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. ఈ విషయంపై ఆ శాఖ ఉన్నతాధికారులు అతడికి మెమో జారీ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. ప్రాథమిక విచారణ చేస్తున్నట్లు సీటీఓ-2 నరసింహులు తెలిపారు. కాగా, ఆ వీడియో జోన్ సమీపంలోని టోల్‌గేట్ అని చెబుతుండగా కాదు గుత్తి టోల్‌గేట్ అంటూ సంబంధిత అధికారి చెప్పుకొచ్చినట్లు సమాచారం.

ధర్మ పరంపరను కొనసాగించాలి

విశ్వ శాంతికి అందరూ పాటుపడాలి

శృంగేరి శారదా పీఠాధిపతి విదుశేఖర స్వామి


కుంభాభిషేకం చేస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): హైందవ సంస్కృతి సంప్రదాయాలు, ధర్మపరంపరను అందరూ కొనసాగించాలని శృంగేరి శారదాపీఠం పీఠాధిపతి విదుశేఖర స్వామి పేర్కొన్నారు. ఆదివారం హిందూపురంలోని శ్రీకంఠపురం, పులమతిరోడ్డులో నిర్మించిన రాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయంలో కుంభాభిషేకం, పునఃప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అమ్మవారి మూల విరాట్ పునఃప్రాణప్రతిష్ఠ, వివిధ అభిషేకాలు, అలంకారసేవలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ విమాన గోపురంపై కళశస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మ అనుగ్రహంతోనే ఆలయ నిర్మాణం జరిగిందన్నారు. అందుకు ఆలయ ధర్మకర్త కిషోర్‌స్వామి, ఆయన కుమారుడు హర్షవర్ధన్, పుర ప్రజల సహకారం ఎంతో ఉందన్నారు. హైందవ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి హిందువు కొనసాగించాలని తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. అనంతరం బ్రాహ్మణ సంఘం, కోట శంకరమఠంలోని వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.

జుత్తు కత్తిరింపు కేసులో 11 మంది అరెస్ట్

నిందితులకు 14 రోజుల రిమాండ్.. మరో 9 మంది కోసం గాలింపు

పెనుకొండ రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిమడుగు గ్రామంలో ఓ మహిళకు జుత్తు కత్తిరించిన కేసులో 11 మందిని శనివారం అరెస్ట్ చేశామని డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాఘవన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నిందితులను పెనుకొండ ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి ముజీబ్ ఎదుట హాజరు పరచగా 14 రోజుల రిమాండు విధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని మునిమడుగు గ్రామంలో ఓ మహిళను జుత్తు కత్తిరించిన కేసులో 20మందిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఐదురోజుల క్రితం మునిమడుగు గ్రామంలో ప్రేమ జంటకు సహకరించిందని గ్రామానికి చెందిన మహిళను అమ్మాయి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు జుత్తును కత్తిరించి వివస్త్రను చేసి చిత్రహింసలు చేశారని వివరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు 20మందిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 11 మంది నిందితులను అరెస్టు చేసి, న్యాయాధికారి ముందు హాజరు పరచగా 14 రోజులు రిమాండు విధించినట్లు తెలిపారు. వీరిని రెడ్డిపల్లి సబ్‌జైలుకు తరలించారమని చెప్పారు. అరెస్టు చేసిన నిందితుల్లో నలుగురు పురుషులు, ఏడుగురు మహిళలు ఉన్నారని, మిగిలిన తొమ్మిది మంది కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ, సీఐ తెలిపారు. మిగిలిన తొమ్మిది మంది నిందితులను కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్‌కి స్వామి ఆశీస్సులు : మంత్రి సవిత


ఆలయం ముందు మంత్రి సవిత

తిరుమల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఏపీ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారడానికి శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు తప్పకుండా ఉంటాయని ఆశిస్తున్నట్టు రాష్ట్ర మంత్రి సవిత తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. వైకుంఠద్వార దర్శనాల చివరిరోజు శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తాను చాలా మంది భక్తులతో స్వయంగా మాట్లాడానని, దర్శనం, ప్రసాదాలు, వసతులు, ఇతర ఏర్పాట్లు చాలా బాగున్నాయని సంతృప్తి వ్యక్తంచేసినట్టు మంత్రి చెప్పారు.

22న డాకు మహారాజ్ విజయోత్సవ సభ

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కథానాయకుడు నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ సినిమా విజయోత్సవ సభ ఈనెల 22న అనంతపురంలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక శ్రీనగర్ కాలనీలోని అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో విజయోత్సవ సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొద్దీన్, ఎన్‌బీకే హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్, నగర అధ్యక్షుడు శ్రీధర్‌లతో కలిసి ఆదివారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించాలని ఏర్పాట్లు చేసినప్పటికీ తిరుపతి ఘటన నేపథ్యంలో రద్దు చేశామని వెల్లడించారు. అందుకే విజయోత్సవ సభను 25వేల మందితో నిర్వహిస్తున్నామన్నారు. అభిమానులు సంయమనం పాటించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గౌస్‌మొద్దీన్ మాట్లాడుతూ అనంతపురంలో విజయోత్సవం నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. జగన్ మాట్లాడుతూ... రాయలసీమపై ప్రత్యేక అభిమానంతో అనంతపురంలోనే ఈవెంట్ నిర్వహించాని బాలకృష్ణ నిర్ణయించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముంటిమడుగు కేశవరెడ్డి, రామలింగారెడ్డి, గంగారామ్, సుధాకర్ యాదవ్, పోతుల లక్ష్మీనరసింహులు, గోళ్ల సుధాకర్ నాయుడు, ముక్తియార్, సైపుద్దీన్, లక్ష్మీనరసింహ, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కవిత్వ విమర్శ.. ఒక ఆత్మకథ

సాహితీ విమర్శకుడు గుంటూరు లక్ష్మీనరసయ్య


పూల మీద వాలిన తేనెటీగ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీకారులు

అనంతపురం కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రతి కవిత్వ విమర్శ ఒక ఆత్మకథ అని సీనియర్ సాహితీ విమర్శకుడు గుంటూరు లక్ష్మీనరసయ్య పేర్కొన్నారు. సాహితీవేత్త తూముచెర్ల రాజారామ్ రచించిన 'పూల మీద వాలిన తేనెటీగ' కవిత్వ విమర్శ వ్యాస సంపుటి పుస్తకావిష్కరణ సభను స్పందన అనంత కవుల వేదిక, హైదరాబాద్‌కు చెందిన కవి సంగమం సాహితీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. గుంటూరు లక్ష్మీనరసయ్యతోపాటు కవిసంగమం సారథి కవి యాకూబ్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సృజనాత్మకత నుంచి సాంకేతికతవైపు నడుస్తున్న కాలంలో పూర్వ విమర్శకులను గౌరవిస్తూ కవిత్వ విమర్శ రాస్తున్న రాజారామ్ భవిష్యత్‌లో మరిన్ని విమర్శనా గ్రంథాలు రాయాలని ఆకాంక్షించారు. కొత్త కవులు, విమర్శకులకు మార్గనిర్దేశం చేస్తూ చదవాలనే ఆసక్తిని కలిగించేలా ఆయన విమర్శ వ్యాసాలు ఉంటాయని అభిప్రాయపడ్డారు. స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ సాహితీవేత్తలు డాక్టర్ శాంతినారాయణ, అంకె శ్రీనివాస్, విశ్వనాథరెడ్డి, నాగేంద్ర, ఈరన్న, యాములపల్లి నర్సిరెడ్డి, తరిమెల అమరనాథరెడ్డి, చెట్ల ఈరన్న, జెట్టి జైరాం, సతీష్‌చంద్ర, అక్బర్, డాక్టర్ ప్రగతి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకం, అలంకరణ, ఆకుపూజ, అర్చనలు చేశారు. కుజదోష, సర్పదోష నివారణకు సుబ్రహ్మణ్యేశ్వర మూల మంత్ర హోమం నిర్వహించారు. అన్నదాన కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బాబు, ప్రధాన అర్చకులు రాముస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.



బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిప్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA- 224885

గాయత్రి జ్యోతిష్యం

పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, స్త్రీ పురుష వశీకరణ, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర: 9440532926.

AJA-NOOR

కావలెను

Wanted మెడికల్ షాప్‌లో పనిచేయుటకు PHARMACISTS కావలెను. వెంటనే సంప్రదించండి. 7399442222

AJA-SREE

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ చిన్న ప్రకటన పెద్ద స్పందన

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

మారుతున్న పల్లెల రూపురేఖలు

● జోరుగా సాగుతున్న అభివృద్ధి పనులు



శింగనమల ఎన్టీఆర్ హమాలీ కాలనీలో పూర్తయిన సీసీ రోడ్డు

శింగనమల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాకతో పల్లెల రూపురేఖలు మారాయి. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీల నిధులు పక్కదారి పట్టడంతో గ్రామాలు ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. కనీసం వీధిలైట్ల మరమ్మతులు చేయించుకోలేని దుస్థితిలో పంచాయతీలు ఉండేవి. ఎన్నికల అనంతరం టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే గ్రామీణ సమస్యలపై దృష్టి సారించింది. నియోజకవర్గంలోని శింగనమల, గార్లదిన్నె, నార్పల, పుట్లూరు, యల్లనూరు, బుక్కరాయసముద్రం మండలాల్లో గత ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని పల్లెలు నేడు అభివృద్ధి బాట పట్టాయి. గత వైసీపీ ప్రభుత్వంలో వీధుల్లో సీసీ రోడ్లు లేకపోవడంతో గ్రామీణులు ఎగుడు దిగుడు గుంతల రోడ్లతోనే కాలంగడిపారు. మురుగుకాలువలు లేకపోవడంతో చిన్న పాటి వర్షం వచ్చినా వీధులన్నీ బురదమయం అయ్యేవి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన అర్నెల్లలోనే పల్లె పండగ పేరుతో గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజ్ కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారానికి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సీసీరోడ్లకు రూ.17 కోట్లు మంజూరు చేసింది. పల్లెల్లో పనులు చేయడానికి చాలా మంది కాంట్రాక్టర్లు ఉత్సహంగా ముందుకొచ్చారు. ఇప్పటికే నాణ్యతతో కూడి పనులు 80 శాతం పూర్తి అయినట్లు అధికారులు తెలుపుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో పనులు చేసినా బిల్లులు రాకపోవడంతో గతంలో కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రాలేదు. ఇప్పుడు పనులు పూర్తి అయిన వెంటనే బిల్లులు మంజూరు అవడంతో పల్లెల్లో అభివృద్ధి వేగంగా ముందుకు సాగుతోంది.

అభివృద్ధి బాటలో నడుస్తున్నాయి



గత వైసీపీ పాలనలో ఏ పల్లెలోనూ సీసీ రోడ్డు వేసిన సందర్భంలేదు. కూటమి ప్రభుత్వం రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పల్లె పండుగ కార్యక్రమం కింద నిధులు మంజూరు చేశారు. ఎమ్మెలే శ్రావణిశ్రీ ప్రత్యేక చొరవతో శింగనమల నియోజకవర్గానికి రూ.17 కోట్లు వచ్చాయి. దీంతో పల్లెలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయి.

- మాసూల చంద్రమోహన్, టీడీపీ నాయకుడు, శింగనమల

పల్లెలు బాగుపడ్డాయి



కూటమి ప్రభుత్వం రాగానే పాలన అభివృద్ది దిశగా వెళతోంది. కూటమి అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకే గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనతో పల్లెలు బాగుపడుతున్నాయి.

-అట్టే రామాంజనేయలు, సోదనపల్లి

గత ఐదేళ్లలో రోడ్లు ఏవీ?



గత వైసీపీ ఐదేళ్ల పాలనలో మా ఊరిలో ఒక్క సీసీ రోడ్డు కూడా వేయలేదు. కూటమి ప్రభుత్వం రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు పల్లెల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఆ మేరకు నిధులు మంజూరు చేయడంతో పనులు జరుగుతున్నాయి. మా చిన్న పల్లెకు రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఇప్పటికే సీసీ రోడ్లు పూర్తి కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

-బండి కొండయ్య, లోలూరు

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం కల్చరల్/క్లాక్‌టవర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ చేపడుతున్న సేవలు అభినందనీయమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సౌజన్యంతో అనంతపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వంద మంది మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ చేశారు. అనంతపురం క్లబ్ ఆవరణలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రోటరీ క్లబ్ సేవలు ఎన్నో కుటుంబాలకు ఉపయోగపడుతున్నాయన్నారు. జిల్లా సర్వజనాస్పత్రి వద్ద కూడా రోటరీ క్లబ్ సేవలు ఉంటే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అనంతపురం అధ్యక్షుడు భవాని రవికుమార్, కార్యదర్శి గల్లా హర్ష, సభ్యులు మేడా అరవింద్, తస్కిన్ కౌర్, టీడీపీ రాష్ట్ర నాయకుడు గంగారామ్, పద్మశాలి ఫెడరేషన్ డైరెక్టర్ లక్ష్మీనరసింహులు, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటరమణ, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన విహార యాత్ర పోస్టర్ల విడుదల



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): లంకల గన్నవరంలోని డొక్కా సీతమ్మ అన్నదాన గృహం సందర్శనకు సంబంధించి విజ్ఞాన విహార యాత్ర పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. నగరంలోని ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా చియ్యేడు జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ... అనంతపురం జిల్లా నుంచి ఐదుగురు, శ్రీసత్యసాయి జిల్లా నుంచి ఐదుగురు చొప్పున మొత్తం పది మందితో పాటు చియ్యేడు పాఠశాలలో పది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు తూర్పుగోదావరి జిల్లాలోని లంకల గన్నవరంలో ఉన్న డొక్కా సీతమ్మ నిత్యాన్నదాన నిలయం సందర్శనకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. డొక్కా సీతమ్మ గృహ సందర్శనకు తాను కూడా వస్తానని ఎమ్మెల్యే తెలిపారన్నారు. కార్యక్రమంలో ఏపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యాక్ష/లు కోనంకి అశోక్‌కుమార్, ఆకుతోటపల్లి టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ రాగేమురళీ మోహన్, స్టోర్ డీలర్ మందల చంద్రశేఖర్, చియ్యేడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



యోగి వేమనకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న యోగివేమన రెడ్డి సేవాసంఘం నాయకులు



చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వేమన ఫౌండేషన్ ప్రతినిధులు



వేమనకు నివాళులర్పిస్తున్న జేఎన్టీయూ వీసీ సుదర్శనరావు

చిరస్మరణీయం.. వేమన పద్యం

● జయంతి సందర్భంగా పలువురి ఘన నివాళి

అనంతపురం టౌన్ జనవరి19(ఆంధ్రజ్యోతి): సరళమైన పదాలతో అందరి నోట తన పద్యాలు పలికించిన మహాకవి యోగివేమన అని కలెక్టరు డాక్టరు వినోద్‌కుమార్ కొనియాడారు. ఆయన పద్యాలు చిరస్మరణీయమన్నారు. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో యోగివేమన జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టరు, జేసీ ఇతర అధికారులు, కవులు పెద్దఎత్తున పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కవి ఏలూరు యంగన్న, జేసీ శివనారాయణ శర్మ, డీఆర్‌ఓ మలోల, జిల్లా టూరిజం శాఖ అధికారి జయకుమార్, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, పౌరసంబంధాలశాఖ అధికారి గురుస్వామిశెట్టి, కవులు శ్రీనివాసరెడ్డి, మధురశ్రీ, కృష్ణమూర్తి, అప్పస్వామి, రామ్మోహన్, రియాజుద్దీన్, నబీరసూల్, రషీద్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

● అనంతపురం కల్చరల్/ సెంట్రల్: దేశంలోనే తొలి సంఘ సంస్కర్త, యోగి వేమన అని యోగి వేమన రెడ్డి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. యోగివేమన జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న యోగి వేమన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోగటం విజయబాస్కర్‌రెడ్డి, యోగివేమన రెడ్డి సేవాసంఘం నాయకులు ఆత్మారామిరెడ్డి, అనంత చంద్రారెడ్డి, బీఎస్ఎన్ఎల్ రాజశేఖర్‌రెడ్డి, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో వేమన చిత్రపటానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు. ఎస్కేయూ విశ్రాంత వీసీ హుసేన్‌రెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత అప్పిరెడ్డి హరినాథరెడ్డి, వేమన ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య రామకృష్ణారెడ్డి, విశ్రాంత ఆచార్యులు బయారెడ్డి, రవీంద్రారెడ్డి, సమాజ సేవకుడు కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు. జేఎన్టీయూలో వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్డీ దేవన్నలు వేమన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు భానుమూర్తి, వైశాలి గోర్పాడే, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇజ్‌తెమా

నార్పల, జనవరి19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నార్పల క్రాసింగ్ వద్ద జిల్లాస్థాయి ఇజ్‌తెమా ఆదివారం ప్రశాంతంగా ము గిసింది. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది ముస్లింలతో ఆ ప్రాంతం కిక్కిరిసింది. డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముస్లిం లకు తాగునీరు, మజ్జిగ, పండ్లు, టీను ఉచితంగా పంపిణీచేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ వెంకటేశ్వర్లు డ్రోన్ కెమెరా ద్వారా పర్యవేక్షించారు. ముస్లిం మత పెద్దలు, సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్, తదితరులుపాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి: సీపీఎం

అనంతపురం కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై ఇటీవల రాజ్యసభలో అవమా నకరమైన వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ ఆదివారం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ సమీపంలో గాంధీ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ... అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారమే ఇపుడు కేంద్ర హోంమంత్రి పదవిలో ఉన్నాననే విషయం అమిత్‌షా గుర్తించాలన్నారు. విజయవాడలో అమిత్‌షా పర్యటనను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

సీడీఎంఏ సుడిగాలి పర్యటన

అనంతపురం క్రైం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) హరి నారాయణ అనంతపురం నగరంలో సుడిగాలి పర్యటన చేశారు. ఆదివారం ఉదయం వచ్చిన ఆయన రీజనల్ డైరెక్టర్(ఆర్‌డీ) కార్యాలయానికి వస్తానని చెప్పారు. కానీ నేరుగా గుత్తిరోడ్డులోని డంపింగ్ యార్డ్ వద్దకు తనిఖీకి వెళ్లారు. తనకు అందిన నివేదిక ఆధారంగా అక్కడ ఇంజనీరింగ్ అధికారులతో ఆరాతీశారు. అక్కడ అపరిశుభ్రతపై అసహనం వ్యక్తం చేశారు. కంపోస్టు తయారీ ఏర్పాటుకు సిద్ధం చేయాలన్నారు. కుక్కలకు అనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ)సెంటర్‌ను డీఎంఏ పరిశీలించారు. దానిని నెలాఖరులోగా ప్రారంభిలని ఆదేశించారు. అక్కడి నుంచి రెండోరోడ్డులోని ప్యాచ్‌వర్క్‌లను పరిశీలించారు. 64వ సచివాల యంలో అడ్మిన్, సిబ్బంది లేకపోవడంపై సీరియస్ అయ్యారు. అనంతరం ఆర్‌డీ కార్యాలయంలో ట్రైనీ కలెక్టర్ వినూత్న, ఆర్డీ విశ్వనాథ్, నగర కమిషనర్ మల్లికార్జున రెడ్డి, డిప్యూటీ కమిషనర్‌తో సమావేశమయ్యారు. అమృత్ స్కీమ్‌కు సంబంధించి త్వరగా పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ క్యాంప్ కార్యాలాయానికి వెళ్లి కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం డీఎంఏ తిరుగు ప్రయాణమయ్యారు. తన పర్యటన సందర్భంగా ఆయన బొకేలు, ఫొటోలను దూరం పెట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.



సీడీఎంఏకి వినతిపత్రం ఇస్తున్న కార్మిక నాయకులు

న్యూస్ బాక్స్

నేటి నుంచి భూ రీసర్వే: తహసీల్దార్

అనంతపురం రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిచెర్ల గ్రామంలో సోమవారం నుంచి రెవెన్యూ అధికారులు భూ రీ సర్వే కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ మోహన్‌కుమర్ తెలిపారు. ఏ రైతు భూమి ఎప్పుడు సర్వే ఉంటుందన్న విషయాన్ని సంబంధిత రైతులకు తెలియజేసినట్లు తెలిపారు. రైతులు భూములకు సంబం.దించిన పత్రాలు, ఇతరాత్ర వాటితో రెవెన్యూ సిబ్బందికి అందుబాటులో ఉండి సహకరించాలని ఆయన సూచించారు.

● గార్లదిన్నె: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేను సోమవారం కల్లూరులో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బండారు ఈరమ్మ ఆదివారం తెలిపారు. భూసమస్యలు ఉన్న రైతులు రీ సర్వేలో అధికారులను సంప్రదించాలన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.4.14 లక్షలు

అనంతపురం రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పశువుల సంతతో స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు రూ. 4,14,580 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ. 2,37,090, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,77,490 వచ్చిందని తెలిపారు.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

గార్లదిన్నె, జనవరి 19(ఆంధ్రజ్యోతి): 20 నుంచి 31 వరకు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 20న గార్లదిన్నె, ముకుందాపురం, 21న కనుంపల్లి, పెనకచెర్ల, 22న గుడ్డాలపల్లి, కొత్తపల్లి, 23న గుడ్డాలపల్లి, సిరివరం, కొప్పలకొండ, 24, 25న కల్లూరు, కేశవాపురం, 27న ఇల్లూరు, కొట్టాలపల్లి, 28న మర్తాడు, క్రిష్టాపురం, 29న కోటంక, బూదేడు, 30న గార్లదిన్నె, సంజీవపురం, 31న యర్ర గుంట్ల గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో పాడి రైతులు, కొర్రెలు, మేకల కాపర్లు వాటికి నట్టల నివారణ మందు తాపించాలని సూచించారు.

సూపరింటెండెంట్‌కు ఉద్యోగోన్నతి

అనంతపురం అర్బన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పశుసంవర్థక శాఖ ఉరవకొండ డివిజన్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులుకు ఉద్యోగోన్నతి లభించింది. ఆయన్ను నెల్లూరు పశుసంవర్థక శాఖ జేడీ కార్యాలయ మేనేజర్‌గా ఉద్యోగోన్నతిపై బదిలీ చేశారు. ఈ మేరకు జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ కార్యాలయానికి అధికారికంగా ఉత్తర్వులు అందాయి. ఆయనకు పలువురు అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

78 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

అనంతపురం అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి వీర్రాజు నేతృత్వంలో అనంతపురం ఆర్టీఏ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. రోజూ సాయంత్రం, రాత్రి సమయాల్లో జిల్లాలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. ఇప్పటిదాకా 78 కేసులు నమోదు చేసి రూ. 6,73,970 జరిమానా విధించారు. అలాగే ఆదివారం అనంతపురం, శింగనమల, తాడిపత్రి, రాప్తాడు, రాయదుర్గం ప్రాంతాల్లో కార్లలో వెళుతున్నప్పుడు సేఫ్టీ బెల్ట్ ధరించడంపై డ్రైవర్లు, ప్రయాణికులకు ఆర్టీఏ అధికారులు అవగాహన కల్పించారు. కారులో ప్రయాణించే వారంతా తప్పని సరిగా సేఫ్టీ బెల్ట్ పెట్టుకోవాలని డీటీఓ వీర్రాజు సూచించారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

అనంతపురం క్రైం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోచేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. నగరంలోని వైఎస్ఆర్ కాలనీలోని ఇరుగుపొరుగు ఇళ్లల్లో నివాసముంటున్న బాషా, హేమలత మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తనను కులం పేరుతో దూషించాడని హేమలత ఫిర్యాదు చేయడంతో బాషాపై వన్‌టౌన్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టరు అక్బర్‌సాబ్

అనంతపురం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గంగానగర్‌లో ఉన్న ఎన్టీఆర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం రామక్రిష్ణ సేవాసమతి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. చూపులోపమున్న దాదాపు 200 మంది వరకు శిబిరానికి తరలి వచ్చారు. వారికి ప్రముఖ కంటి వైద్యనిపుణులు డాక్టరు అక్బర్‌సాబ్, హైదరాబాద్‌కు చెందిన కంటి డాక్టర్ మిథున్‌రెడ్డి కంటి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తామని డాక్టరు అక్బర్ తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవాసమి తి అధ్యక్షుడు డాక్టరు కృష్ణశశి, సెక్రెటరీ ప్రవీణ్‌కుమార్, కోశాధికారి జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు మరూరులో ఊరి దేవర

రాప్తాడు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరూరులో మంగళవారం ఊరి దేవర నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. చాలా ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న ఊరి దేవరకు ఇప్పటికే గ్రామంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు వీధులను టీడీపీ నాయకులు శుభ్రం చేయించారు. వీధిలైట్లు అమర్చారు. గ్రామంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా గ్రామస్థులు, పోలీసులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

దేవప్రసాద్ సంతాప సభ

అనంతపురం కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): జర్నలిజం రంగంలో తనదైన సేవలందించిన మొదటితరం సీనియర్ జర్నలిస్టు నందినేని దేవప్రసాద్ నేటి, భవిష్యత్ తరాల జర్నలిస్టులకు ఆదర్శప్రాయులని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సంతాపసభలో దేవప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ఫొటో, వీడియో జర్నలిస్టులు పా ల్గొన్నారు. వారు నందినేని దేవప్రసాద్‌తో ఉన్న వ్యక్తిగత వృత్తి అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందిన కల్యాణదుర్గం రిపోర్టర్ పురుషోత్తం మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు మార్కండేయులు, ప్రభాకర్‌నాయుడు, రాచమల్లు భోగేశ్వర్‌రెడ్డి, కేపీ కుమార్, జయరాం, ఎలక్ట్రానిక్ మీడియా సంఘం అధ్యక్షుడు జగదీష్, రామాంజనేయులు, చలపతి, శివారెడ్డి, సాయిప్రసాద్, లోకరాజు, రమేష్‌రెడ్డి, ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు డేనియల్, ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణ, నాగేంద్రరెడ్డి, బీవీ రెడ్డి, ఆనందవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీ పంచకుండీ పూజలు



వెండిచీరలో వాసవీమాత

అనంతపురం కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : వాసవీమాత దీక్ష మండలకాలాన్ని పురస్కరించుకుని ఆదివారం కొత్తూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పంచకుండీ పూజలను వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్‌ను వెండిచీరతో అలంకరించి, ఆలయ ఆవరణలో పంచకుండీ పూజలు నిర్వహించారు. వందలాదిమంది ఆర్యవైశ్యులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. వాసవీమాత నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అలాగే ఆలయ ఆవరణలో వాసవీ పంచకుండీ హోమం నిర్వహించారు. అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో కొత్తూరు ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు గోపామచ్చా నరసింహులు, వాసవీ దీక్షాసమితి అధ్యక్షుడు సుకుమార్‌గుప్త, నాగరాజు గుప్త, నాగభూషణ, మురళీకృష్ణ, కిశోర్‌కుమార్, సతీష్ గుప్తా, కురిడి వెంకటేష్, మధుబాబు, అశ్వత్థనారాయణ, ఫణికుమార్, నిర్మలాదేవి, జయలక్ష్మి, జ్యోత్న్న, వాసవీదీక్షధారులు తదితరులు పాల్గొన్నారు.

‘మహా కుంభాభిషేక వేడుకలకు తరలిరండి’

అనంతపురం కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మించి రెండు పుష్కరాలు ముగిసిన నేపథ్యంలో ఫిబ్రవరి 14, 15, 16వ తేదీల్లో నిర్వహించనున్న మహాకుంభాభిషేక వేడుకలను విజయవంతం చేయాలని ఆలయ ప్రధానార్చ కుడు ఆలూరు లక్ష్మీనరసింహశాస్త్రి పిలుపునిచ్చారు. ఆలయ ఆవరణలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 14న శోభాయాత్ర నిర్వహిస్తామని తెలి పారు. 15న 27 హోమకుండాలలో 108 జంటలచే సామూహిక గణపతి, నవగ్రహ, లక్ష్మీనారాయణ హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామి అనుగ్రహభాషణం ఉంటుందన్నారు. 16న ఉదయం 7 గంటలకు ప్రధాన హోమం, 7.45కు విద్యారణ్య భారతీస్వామి చేతలమీదుగా మూలవిరాట్లకు మహాకుంభాభిషేకం చేస్తామని తెలిపారు.

పోరాటాలతోనే బలమైన నాయకత్వం : అనంత

అనంతపురం క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పోరాటాల ద్వారానే నాయకత్వం బలోపేతం అవుతుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక కోర్టు రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నగర పరిధిలోని పార్టీ యువజన నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి పార్టీకి అనుబంధ సంఘాలు ఎంతో కీలకమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో యువత కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక హామీల అమలులో చేతులెత్తేసిందన్నారు. రాజకీయాల్లో ఉన్నవారెవరైనా ప్రజల సంక్షేమమే ప్రథమ లక్ష్యంగా పని చేయాలన్నారు. ఎవరితోనూ వ్యక్తిగత విభేదాలు వద్దని, సమష్టిగా ముందుకెళ్లాలని తెలిపారు. సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ... త్వరలోనే యువజన విభాగం జిల్లా, నియోజకవర్గ, నగర కమిటీల నియామకం పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో యువజన నాయకులు శ్రీనివాస్ గురుదత్తా, లోక్‌నాథరెడ్డి, నాగార్జున నాయకులు పాల్గొన్నారు.

పీ-4 విధానాన్ని స్వాగతిస్తున్నాం

●ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పేదిరికం లేని సమాజ స్థాపనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న పీ-4 విధానాన్ని స్వాగతిస్తున్నామని ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ తెలిపారు. స్థానిక ఎన్జీఓ హోంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పీ-4 విధానాన్ని తమ సంఘం స్వాగతిస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పీ-4 విధానంలో కులాల ప్రాతిపతికన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ‘‘పీ-4 విధానానికి సంపూర్ణ మద్దతు, సహకారం అందిస్తామన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శంకరయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల స్పోర్ట్స్, కల్చరల్ కమిటీ ఎన్నిక



ఎంపికైన కార్యవర్గంతో డీఆర్ఓ, ఆర్డీఓ

అనంతపురం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ ఎంప్లాయిస్ స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ కమిటీని ఆదివారం ఎన్నికున్నారు. నగరంలోని కృష్ణ కళామందిర్‌లో సంఘం సమావేశం నిర్వహించి, కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా హరిప్రసాద్‌రెడ్డి, కోశాధికారిగా శ్రీనివాసమూర్తి, ఉపాధ్యక్షులుగా హరిప్రసాద్, చంద్రరేఖర్, మూర్తి ప్రసాద్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీలుగా సిరాయణ స్వామి, సాహీద్‌అక్రమ్, భరత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీని డీఆర్‌ఓ మలోల, ఆర్డీఓ కేశవనాయుడు అభినందించారు.

ఆంధ్రా అండర్-16 జట్టుకు ప్రాణధీర్



అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్-16 జట్టుకు జిల్లాకి చెందిన ప్రాణధీర్ ఎంపికయ్యాడు. తమిళనాడు రాష్ట్రంలోని తిరునల్వేలిలో మంగళవారం నుంచి నిర్వహించే అండర్-16 సూపర్‌కింగ్స్ టోర్నమెంట్‌కు ఆంధ్రా జట్టు తరఫున ప్రాణధీర్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణిస్తూ ఆల్‌రౌండర్‌గా గుర్తింపు సాధించాడు.

మహిళా క్రికెట్ టోర్నీ విజేత ఎంఎస్‌కే జట్టు



విజేత ఎంఎస్‌కే అకాడమీ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మహిళా క్రికెట్ కప్ టోర్నీ విజేతగా ఎంఎస్‌కే అకాడమీ జట్టు నిలిచింది. స్థానిక అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో ఆదివారం అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ, ఆర్డీటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న మహిళా క్రికెట్ కప్- 2025 టోర్నీ ఫైనల్స్‌ను ఆదివారం నిర్వహించారు. ఎంఎస్‌కే అకాడమీ జట్టు, అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఏఎస్ఏ అకాడమీ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 91 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఎంఎస్‌కే అకాడమీ జట్టు 14.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 94 పరుగులు సాధించింది. ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపొందింది. దీంతో విజేతగా నిలిచిన ఎంఎస్‌కే జట్టు, రన్నరప్‌గా నిలిచిన ఏఎస్ఏ జట్లకు ముఖ్య అతిథిగా హాజరైన జేసీ శివనారాయణశర్మ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోలా, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, జిల్లా క్రికెట్ సంఘం ఇంచార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి, విజయవాడ హరికృష్ణ, యూఖా అకాడమీ వెంకటేశ్వరరెడ్డి, కోచ్‌లు కుమార్, నరేష్, శర్మాస్, వెంకటేశ్, ఇనయతుల్లా, మహేశ్వర్, హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్


వైభవంగా మన్యుసూక్త హోమం



మన్యుసూక్త హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

గుంతకల్లు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో పుష్యార్క సంక్రమణం సందర్భంగా ఆదివారం ఉదయం మన్యుసూక్త, పంచసూక్త మూల మంత్ర హోమాలను నిర్వహించారు. ఆలయ యాగశాలలో స్వామివార్ల చిత్రపటాలు, ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహానికి అలంకారాలుచేసి హోమాలను చేపట్టారు. ఆలయ వేదపండితుడు రామకృష్ణావధాని, అర్చకులు, వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ దేవర



అలంకరణలో అమ్మవారు

యల్లనూరు/పుట్లూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): యల్లనూరు మండలకేంద్రం, పుట్లూరులోని కడవకల్లు గ్రామాల్లో ఆదివారం వైభవంగా దేవరను నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి నుంచి పెద్దమ్మతల్లిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. దేవరను పురస్కరించుకొని దూర ప్రాంతాల నుంచి బంధువులు, స్నేహితులు తరలిరావడంతో గ్రామాలు కిటకిటలాడాయి. పెద్దమ్మతల్లిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

నేటి నుంచి కొల్లాపురమ్మ జాతర

శెట్టూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలేడు గ్రామంలో సోమవారం నుంచి కొల్లాపురమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ లక్ష్మీ నాగరాజు, ఎంపీటీసీ లింగప్ప తెలిపారు. మంగళవారం అమ్మవారికి జ్యోతుల బోనాలు, బుధవారం పూజలు, జంతుబలి, 23వ తేదీ గురువారం పోతుల రాజు సమక్షంలో గావు మహోత్సవం, 24న అమ్మవారికి మహామంగళహారతి, మేటి బాణం, జ్యోతుల కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర ముగుస్తుందన్నారు.

కూడేరు: మండలంలోని మూడు గ్రామాల్లో గ్రామ దేవర నిర్వహిస్తున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు తెలిపారు. కడదరకుంటలో బొడ్రాయి ప్రతిష్ఠ సందర్భంగా 20, 21 తేదీల్లో దేవర చేయడానికి పెద్దలు నిర్ణయించడంతో అందుకు స్థానికులు సిద్ధం చేస్తున్నారు. ముద్దలాపురంలో ముత్యాలప్ప విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా 21, 22 తేదీల్లో దేవర సిద్ధం చేస్తుండగా, 21, 22 తేదీల్లో ఉదిరిపికొండ గ్రామంలో దేవరకు సిద్ధం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

నేడు శాంతలింగేశ్వర స్వామి అనుష్ఠానోత్సవం

బ్రహ్మసముద్రం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పులకుంట గ్రామంలో ముమ్మడి శాంతలింగేశ్వరస్వామి వారి అనుష్ఠానం చేసి 26 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం అనుష్ఠానోత్సవం నిర్వహించనున్నారు. కేదారనాథ్ ఆలయ ఆస్థాన స్వామీజీ నాల్వడి శాంత లింగేశ్వరస్వామి వారి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటలకు మహా కుంభాభిషేకం, గ్రామంలో స్వామివారి ఊరేగింపు, ధ్వజారోహణం, ఆలయంలో అభిషేక పూజలు నిర్వహించనున్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

రథసప్తమి పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

ఉరవకొండ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి గ్రామంలో వెలసిన సూర్యనారాయణస్వామి ఆ లయంలో ఆదివారం రథసప్తమి పోస్టర్లను కమిటీ సభ్యు లు విడుదల చేశారు. ఫిబ్రవరి 3, 4 తేదీల్లో రథసప్తమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. గోపూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన దీక్షా హోమాలతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. 4వ తేదీన రథసప్తమిని పురస్కరించుకుని చాయా ఉషా సమేత సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం, మృత్యుంజయ హోమం, మహాసౌరపూర్వక అరుణ హోమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు మహేంద్ర గౌడ్, సుధాకర్, కృష్ణ మోహన్, రామస్వామి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి



వేమన చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నిర్వాహకులు

గుత్తి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివేకానంద పాఠశాలలో ఆదివారం యోగి వేమన అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రజాకవి యోగివేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ వేమన గొప్ప కవి అని కొనియాడారు. వేమన జయంతి రోజున సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించాలన్నారు. ఆయన జయంతి వేడుకలను ప్రభుత్వమే నిర్వహించారలన్నారు. కమిటీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, ఎంపీపీ విశాలాక్షి, వెంకటేష్, విజయభాస్కర్, జయరామిరెడ్డి, హెచ్ఎం శారదా పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌కు ఉద్యోగోన్నతి



శ్రీనివాసులు

అనంతపురం అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ ఉరవకొండ డివిజన్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులుకు ఉద్యోగోన్నతి లభించింది. ఆయన్ను నెల్లూరు పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయ మేనేజర్‌గా ఉద్యోగోన్నతిపై బదిలీ చేశారు. ఈ మేరకు జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయానికి అధికారికంగా ఉత్తర్వులు అందాయి.

సవాళ్లను నూతన ఏఎస్పీ అధిగమించేరా..?

- క్రైం రేటు తగ్గించేందుకు తన మార్క్ చూపిస్తారా?
- మట్కా, పేకాట, గంజాయి, చోరీలను నిర్మూలించేనా?
- తాడిపత్రికి రెండోసారి ఏఎస్పీ స్థాయి అధికారి



ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి

తాడిపత్రి, జనవరి19(ఆంధ్రజ్యోతి): నూతన ఏఎస్పీగా పదవీబాధ్యతలు స్వీకరించిన రోహిత్‌కుమార్‌చౌదరికి అడుగడుగునా సవాళ్లే కనిపిస్తున్నాయి. ఈ సవాళ్లను ఆయన అధిగమిస్తాడా లేదా అన్నది తెలియాలంటే మరికొన్ని రోజులు వేచిచూడాల్సిందేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోనే తాడిపత్రి నియోజకవర్గం అత్యంత సమస్యాత్మక ప్రాంతం కావడం ఏ చిన్న సంఘటన జరిగినా ప్రాణనష్టం, ఆస్తుల నష్టం జరగడం పరిపాటిగా మారింది. దీంతో ఈ ప్రాంతంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి తాడిపత్రి చరిత్రలోనే రెండోసారి ఏఎస్పీస్థాయిలో అధికారిని నియమించింది. మొదటిసారి విజయ్‌కుమార్ ఏఎస్పీగా పనిచేశారు. ప్రస్తుతం ఇదే తరహాలోనే రోహిత్‌కుమార్‌చౌదరిని నియమించారు. తాడిపత్రి పట్టణంలో మూడునెలల నుంచి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. వీటిని అరికట్టేందుకు ప్రస్తుత పోలీసు అధికారులు విఫలమయ్యారనే ప్రచారం ఉంది. పలుమార్లు ఆంధ్రజ్యోతిలో మట్కా, పేకాట, గంజాయిపై వరుస కథనాలు వచ్చినా పోలీసుల్లో చలనం లేకపోవడం గమనార్హం.

పేదలే టార్గెట్: పట్టణంతోపాటు యల్లనూరు, యాడికి మండలాలు, నంద్యాల, అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలకు సరిహద్దు ప్రాంతంగా ఉంటోంది. దీంతోపాటు తాడిపత్రిచుట్టూ సిమెంట్‌ఫ్యాక్టరీలు, గ్రానైట్, నల్లబండల పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో పనిచేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం కూలీలు వస్తుంటారు. వీరిని టార్గెట్ చేస్తూ కొందరు బీటర్లు మట్కా రాస్తున్నారు. రోజంతా కూలీ చేసుకొని సంపాదించిన డబ్బులు ఆశపడి మట్కా ఆడుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఎంతమంది పోలీసు అధికారులు వచ్చినా తాడిపత్రిలో మట్కామహమ్మారిని నియంత్రించలేకపోవడం గమనార్హం. అలాగే పట్టణంతోపాటు పరిసర ప్రాంతాలు, గ్రామాల్లో పేకాట స్థావరాలు అధికమయ్యాయి. అప్పుడప్పుడు పోలీసులు దాడులు చేయడంతోనే సరిపెడుతున్నారు.



గంజాయి, దొంగల హల్‌చల్: గతంలో ఎన్నడూలేనివిధంగా పట్టణంలో దొంగతనాలు ఎక్కువయ్యాయి. పోలీసులు నిద్రావస్థలో ఉండడంతో వారు తమ పనికి సానబెడుతున్నారు. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట దొంగతనం జరుగుతుందంటే ఆశ్చర్యం వేస్తోంది. నెలరోజులకు దాదాపు 20కిపైగానే జరిగాయి. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాలంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. ఇక మహిళల మెడలో నుంచి చైన్‌స్నాచింగ్ కేసులూ అధికమయ్యాయి. దీంతో మహిళలు బయటకు వెళ్లాలన్నా, వాకింగ్‌కు చేయాలన్న జంకుతున్నారు. పదిరోజులక్రితం గాజులక్రిష్టప్పవీధిలో ముగ్గు వేస్తున్న మహిళ మెడలో నుంచి గుర్తుతెలియని దుండగుడు బంగారు గొలుసును అపహరించాడు. అలాగే చీకటిపడితే చాలు ద్విచక్రవాహనాలపై గంజాయి బ్యాచ్‌లు రోడ్లలో హల్‌చల్ చేస్తున్నాయి. పట్టణ శివారు ప్రాంతాల్లో సైతం ద్విచక్రవాహనాల్లో వెళ్లేవారిని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. యల్లనూరురోడ్డులో గంజాయి సేవించిన కొందరు యువకులు బేల్దారి పనులు చేసుకుంటున్న నలుగురిని చితకబాదారు. దీంతో వారు తీవ్రంగా గాయపడి బెంగళూరులో చికిత్స తీసుకుంటున్నారు. వీరిలో మైనర్లు కూడా ఉండడం గమనార్హం.

ఏఎస్పీ మార్క్ కనిపించేనా?: నూతన ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి తాడిపత్రిలో అదుపుతప్పిన శాంతిభద్రతలను గాడిలో పెట్టి తన మార్క్ చూపించేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో 2001లో పట్టణంలో శాంతిభద్రతలు అదుపుతప్పిన సందర్భంలో పోలీసు ఉన్నతాధికారులు మొదటిసారి ఏఎస్పీ అధికారిగా విజయ్‌కుమార్‌ను నియమించారు. ప్రస్తుతం శాంతిభద్రతలు అదుపుతప్పడంతో పాతిక సంవత్సరాల తర్వాత ఏఎస్పీ అధికారి నియమితులయ్యారు. మట్కా, గంజాయిపై ఏఎస్పీ ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని ప్రజలు వేచిచూస్తున్నారు.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

గుంతకల్లుటౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. అమిత్‌షా రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆదివారం వామపక్షపార్టీల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు శ్రీనివాసులు, సీపీఐ వీరభద్రస్వామి, సీపీఎం మారుతిప్రసాద్, జగ్గలిరమేష్, కసాపురం రమేష్, సాకేనాగరాజు, సురేంద్ర, గోపినాథ్, రాము, రామాజంఇనేయులుయాదవ్, దేవేంద్ర, కుళ్లాయిస్వామి పాల్గొన్నారు.

ఉరవకొండ: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని సీపీఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం వారు ఆందోళన చేపట్టారు. నాయకులు మల్లికార్జున, బ్యాళ్లప్రసాద్ మాట్లాడుతూ దేశంలో బడుగు, బలహీన వర్గాలు ఆరాధించే దైవం అంబేడ్కర్ అని, అలాంటి వ్యక్తిని అవమానించడం దారుణమన్నారు. సీపీఐ నాయకులు సుల్తాన్, గౌస్, తిప్పయ్య, మల్లేష్, కాంగ్రెస్ నాయకులు శ్రీన, అబ్బాస్, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కళ్యాణదుర్గం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తేదీన ఇదేం తీరు... కౌన్సిల్ సమావేశం నిర్వహించని పాలకవర్గం అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. మున్సిపల్ కమిషనర్ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించి బడ్జెట్ సమావేశం నిర్వహించి అభివృద్ధిపై చర్చించారు. సమావేశంలో కీలక నిర్ణయాలను తీసుకున్నప్పుడే పట్టణాన్ని అభివృద్ధివైపు నడిపించవచ్చన్నారు. కౌన్సిలర్లు కూడా ఏకాభిప్రాయానికి రావడంతో మున్సిపల్ బడ్జెట్ సమావేశం తేదీని నిర్ణయించారు.

ఫర్టిలైజర్స్ సంఘం అధ్యక్షుడికి సన్మానం

గుంతకల్లుటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన చింతా వెంకటేశ్వర్లును ఆదివారం గుంతకల్లు మండల డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో సన్మానం చేశారు. మండల అధ్యక్షుడు వీ కిష్టప్ప, డీలర్లు లోక్‌నాథ్, వెంకటేష్, లింగన్న, శీనా, సురేంద్రరెడ్డి, నెట్టప్ప, దేవేంద్ర, వన్నూరప్ప, గోపాల్ పాల్గొన్నారు.

ఆలయానికి ప్లేట్లు, గ్లాసుల వితరణ

కుందుర్పి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బొమ్మలనాయుడు ఈశ్వర దేవాలయానికి ఆదివారం కుందుర్పి ఎంపీడీవో లక్ష్మీ శంకర్, ఎస్ఐ నాగేష్ స్టీల్ ప్లేట్లు, గ్లాసులు వితరణ చేశారు. ఆలయ అభివృద్ధికి తగిన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

పుట్లూరు ఎస్ఐగా వెంకట నరసింహ

పుట్లూరు, జనవరి19(ఆంధ్రజ్యోతి): పుట్లూరు ఎస్ఐగా వెంకటనరసింహ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ హేమాద్రి బదిలీపై చిత్తూరు జిల్లాకు వెళ్లడంతో ఖాళీగా ఉన్న ఈ స్థానంలో వెంకటనరసింహను నియమించారు. ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఐకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అనారోగ్యంతో బాలిక మృతి

డీ.హీరేహాళ్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులకుర్తి గ్రామానికి చెందిన చందన(10) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందింది. పులకుర్తి గ్రామానికి చెందిన చంద్ర, సావిత్రి దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద అమ్మాయి చందన 6వ తరగతి చదువుతోంది. 15 రోజుల క్రితం ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చికిత్స కోసం కర్ణాటక రాష్ట్రం బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నాలుగురోజులపాటు చికిత్స అందించారు. ఆరోగ్యం నయం కాకపోవడంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ పదిరోజులుకుపైగా చికిత్స అందించారు. శనివారం అర్ధరాత్రి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చందనను కుటుంబసభ్యులు గ్రామానికి తరలించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసముంటున్న భాగ్యలక్ష్మి అనే మహిళ ఆదివారం విషద్రావకం ఆత్మహత్యకు యత్నించినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాల కారణంగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

కళ్యాణదుర్గం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలం ఓబిగానిపల్లి గ్రామానికి చెందిన చాకలి రాజన్న (30) అనే వ్యక్తి మద్యానికి బానిసై శనివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు చాకలి రాజన్న మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెందాడన్నారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి వచ్చిన భార్య, తల్లి చూడగా రాజన్న ఉరివేసుకోవడం గమనించి గట్టిగా కేకలు వేశారు. అప్పటికే అపస్మారక స్థితిలో వున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు వైద్యం కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఎస్ఐ ప్రవీణ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో పెయింటర్ మృతి

బెళుగుప్ప, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన పెయింటరు కృష్ణ(35) కర్నూలు జిల్లా పత్తికొండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శనివారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. పెయింటర్‌గా జీవనం సాగిస్తున్న కృష్ణ వృత్తిరీత్యా బైకుపై మరో వ్యక్తితో కలసి వెళుతుండగా పత్తికొండ వద్ద లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారన్నారు. మృతుడి వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా చిరునామా కనుగొని పోలీసులు, బంధువులకు సమాచారమిచ్చారు. పెయింటర్‌కు భార్య తిమ్మక్క, కుమారుడు దుర్గాప్రసాద్, కుమార్తె దివ్యశ్రీ ఉన్నారు.

చికిత్స పొందుతూ.. వలస కూలీ..

రాయదుర్గంరూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పొట్ట కూటి కోసం వలస వెళ్లి కర్ణాటకలోని బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో విశ్వనాథ(38) అనే కూలీ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మండలంలోని రాయంపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథ కర్ణాటకలోని బెంగళూరుకు కూలీ పనుల కోసం వెళ్లాడు. 12వ తేదీన రాత్రి రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చేర్పించారు. కోమాలోకి వెళ్లి చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు తెలిపారు. విశ్వనాథ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పాఠశాలలో చోరీ

విడపనకల్లు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హావళిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి చోరీ జరిగింది. గ్రామస్థులు తెలిపిన మేరకు శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాలలోని కంప్యూటర్ గదికి తాళాలు పగులగొట్టి అందులోని టీవీ, క్రీడాసామగ్రిని ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం పాఠశాల వద్దకు వెళ్లిన వాచ్‌మన్ కంప్యూటర్ గది తాళాలు తెరిచి ఉండటాన్ని చూసి పాల్తూరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. పాల్తూరు ఎస్ఐ మురారిని వివరణ కోరగా అక్కడ చోరీ జరగలేదన్నారు. టీవీ పోయిన మాట వాస్తవమని విచారించి చర్యలు చేపడతామన్నారు.

జూదరుల అరెస్టు

బొమ్మనహాళ్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహొన్నూరు గ్రామ శివారులో ఆదివారం పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు గ్రామ సమీపంలోని ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.3,500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని పెంచాలి

- జలసాధన సమితి నాయకుడు శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ప్రధాన కాలువను పది వేల క్యూసెక్కుల నీటి సామర్థ్యాన్ని పెంచాలని ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జలసాధన సమితి నాయకుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పట్టణంలోని గుంతకల్లప్ప కల్యాణమండపంలో జలసాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా కాలువపై ప్రభుత్వ విడుదల చేసిన జీఓలు రద్దుచేయాలని, కాలువ వెడల్పు పెంచాలని, లైనింగ్ పనులను నిలిపివేయాలన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు ప్రారంభమై నేటికి 37 సంవత్సరాలైందన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కాలువకు బడ్జెట్ కేటాయించడంలేదన్నారు. రాయలసీమ ప్రయోజనాలను ఎవరూ కాపాడటం లేదని విమర్శించారు. జీడిపల్లి నుంచి చిత్తూరు వరకు 565 కి.మీ వరకు కాలువ వెడల్పు చేయాలన్నారు. మడకశిర బ్రాంచ్ కాలువకు 1500 క్యూసెక్కుల నీరు పారేందుకు వెడల్పు చేయాలని సూచించారు. హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి పిల్ల కాలువలను ఏర్పాటు చేసి రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో 6,02,500ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు ఇవ్వాలన్నారు. సాగునీటి బడ్జెట్‌లో రాయలసీమ ప్రాజెక్టులకు కేవలం 15 శాతం మాత్రమే కేటాయిస్తున్నారని, 46 శాతానికి పెంచాలన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టుకు పట్టిసీమ ద్వారా గోదావరి జలాలలో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 45టీఎంసీల నికర జాలలు కేటాయించాలన్నారు. పీఏబీఆర్ ప్రాజెక్టుకు 11 టీఎంసీలు పూర్తిస్థాయిలో నీరు నిలువ ఉండే విధంగా ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జలసాధన సమితి గుంతకల్లు కార్యదర్శి బీ సురేష్, పౌర ప్రగతిశీల వేదిక కార్యదర్శి తారకేష్, ఓపీడీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు న్యాయవాది నాగరాజు, రఘునాథ్‌రెడ్డి, ఎర్రిస్వామి, దావీద్, ఆశాబీ, మోహన్ నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసులు



విప్ కాలవ శ్రీనివాసులును సన్మానిస్తున్న బెస్త కులస్థులు

బెస్తల సమస్యలు పరిష్కరిస్తా: విప్

కణేకల్లు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బెస్త కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బెస్తకులస్థుల ఆరాధ్యదైవం అంబిగర చౌడయ్య జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కర్ణాటకలో జన్మించిన అంబిగర చౌడయ్య తన పాటలు, కీర్తనలతో ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంచి సన్మార్గం వైపు నడిపించారన్నారు. అలాంటి వ్యక్తి జయంతి ఉత్సవాలకు హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. అలాగే ర్యాలీలో పాల్గొన్న ఆయన చౌడయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం విప్ కాలవకు శాలువ, పూలమాలలతో కులస్థులు సన్మానించారు. అంతకు ముందు చిక్కణ్ణేశ్వరదేవాలయం నుంచి ర్యాలీగా వేదవతి హగరికి చేరుకుని అక్కడ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి గంగాజలంతో అంబిగర చౌడయ్య చిత్రపటం వద్ద పూజలు నిర్వహించారు. వన్నూరుస్వామి, ముక్కన్న, గోవిందు, పురుషోత్తం, నాగరాజు, కుమార్, సూరి, రాము, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, చంద్రశేఖర్‌గుప్తా, బీటీ రమేష్, షేక్‌ముజ్జు, మాబుసాబ్, చాంద్ బాషా, నాగరాజు, అనిల్, జిలాన్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులు.. ఉద్యోగాలు సాధించాలి

- ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



డీఎస్సీ మోడల్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాకు కేటాయించిన డీఎస్సీ పోస్టులలో అత్యధికంగా ఈ నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. ఆదివారం ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన డీఎస్సీ మోడల్ పరీక్షను పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. మోడల్ పరీక్ష కేంద్రానికి ఎమ్మెల్యే వెళ్లి పరిశీలించారు. పరీక్షలు రాసే అభ్యర్థులను పలకరించి వారితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి డీఎస్సీ మోడల్ పరీక్షలు నిర్వహించి అభ్యర్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రయత్నిస్తున్న బద్దేనాయక్‌ను అభినందించారు. ప్రభుత్వం నిర్వహించే డీఎస్సీ పరీక్షల్లో విజయం సాధించేందుకు ఈ పరీక్ష ఉపయోగపడుతుందని అన్నారు.

రక్తదాన శిబిరంలో పాల్గొనండి



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు మల్లికార్జున

కళ్యాణదుర్గం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా విరివిగా రక్తదానం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని టీడీపీ నాయకుడు ధర్మతేజ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద ఐదు మండలాల టీడీపీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 23వ తేదీన లోకేశ్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు. గ్రామస్థాయిలో యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. రాష్ట్రంలోనే కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో వుండాలన్నారు.

మున్సిపల్ కార్మికులపై వేధింపులు ఆపాలి



సీడీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

తాడిపత్రి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులపై అధికారులు వేధింపులను ఆపాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రానికి వచ్చిన మున్సిపల్ సీడీఎం హరినారాయణశర్మకు సీఐటీయూ నాయకులతో కలిసి కార్మికులు వినతిపత్రం అందజేశారు. నాయకులు రామాంజనేయులు, ఉమాగౌడ్, పలువురు మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన జితేంద్రగౌడ్



మంత్రి అచ్చెన్నాయుడుతో జితేంద్రగౌడ్, టీడీపీ నాయకులు

గుంతకల్లుటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, సహకార మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును శనివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్ర గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలో మంత్రి చాంబర్‌లో ఆయనను కలిసి శాలువ కప్పి సత్కరించారు. ఆర్ పవన్‌కుమార్‌గౌడ్, వీరభద్రయ్య, ముక్కన్నగారి రామాంజనేయులు, మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో అక్రమాలపై విచారించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కూడేరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో అనర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించి అక్రమాలకు పాల్పడ్డారని తక్షణం కలెక్టర్ విజిలెన్స్ అధికారులతో విచారణ చేయించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి అనర్హులకు ఇళ్ల పట్టాలు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారని, పూర్తి స్థాయి విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతోపాటు మండల కార్యదర్శి కరీమ్, మల్లికార్జున ఉన్నారు.

మార్నింగ్ వాకర్స్ ఆధ్వర్యంలో సమావేశం

గుంతకల్లుటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో ఆదివారం మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. 30 సంవత్సరాల నుంచి వాకింగ్ చేస్తున్న సభ్యులు, ప్రస్తుతం వాకింగ్ చేస్తున్న వారు సమావేశంలో పాల్గొన్నారు. సభ్యులు మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. అనంతరం వాకర్స్ సభ్యుడు శతాధిక వృద్ధుడు పరశురామప్పను, అధ్యక్షుడు అంజిలను శాలువకప్పి పూలమాలలతో సత్కరించారు.